


నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
నిజామాబాద్
కామారెడ్డి
శుక్రవారం 14 ఫిబ్రవరి 2025 4 పేజీలు





# క్రిప్టో “మాయ”



- కరోనాకు మించిన కష్టకాలం, కుదేలవుతున్న వ్యాపారాలు
- జిల్లాలో వందల కోట్లల్లో పెట్టుబడులు
- సౌదీ అరంకోల్‌లో పని చేసేవారినుండి భారీ పెట్టుబడులు
- పోలీసులు అవగాహన కల్పించిన ఆగని క్రిప్టో

**సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి**



సాంకేతికత పెరుగుతున్న కొద్ది ప్రజల్లో తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు ఆర్జించాలనే కోరికలు ఎక్కువ అవుతున్నాయి. అందుకే అన్లైన్ ఆప్‌ల్లో పెట్టుబడులు అధికంగా పెట్టి తీరా మోసపోయాకా లబోదిబో మంటున్నారు. ఈ మధ్యకాలంలో అన్లైన్ ఆప్‌లు ప్రజలను ఆకర్శించేందుకు కొత్త కొత్త పుంతాలు తొక్కుతున్నాయి,వాటిని నమ్మి నట్టేట మునగడం ప్రజల వంతైతుంది..... 2లో...

## పోలింగ్ కేంద్రాలలో వసతులను పరిశీలించిన కలెక్టర్

### - పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తనిఖీ

**సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి**

నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాలతో కూడిన శాసన మండలి ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలను పురస్కరించుకుని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శుక్రవారం పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఆర్మూర్, బాల్కొండ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని భీంగల్, వేల్పూర్, పెర్కిట్ ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. పోలింగ్ స్టేషన్లలో అందుబాటులో ఉన్న వసతులను తనిఖీ చేశారు. ర్యాంప్, టాయిలెట్స్, విద్యుత్ సరఫరా, నీటి వసతి ఇత్యాది సదుపాయాలను పరిశీలించారు. ప్రతిపాదిత పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని



అధికారులను ఆదేశించారు. ఎలాంటి అవాంతరాలు లేకుండా సాఫీగా పోలింగ్ ప్రక్రియ జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాలకు వేర్వేరుగా ఎంపిక చేసిన పోలింగ్ స్టేషన్లలో లోటుపాట్లు లేకుండా అన్ని సదుపాయాలు సక్రమంగా ఉన్నాయా లేవా అని పక్కాగా నిర్ధారణ చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనము నాణ్యతను తనిఖీ చేశారు. విద్యార్థినీ విద్యార్థుల కోసం వండిన అన్నం, కూరలతో పాటు పాఠశాలలకు కేటాయించిన బియ్యం నిల్వలు, కూరగాయలు, ఇతర సరుకులను పరిశీలించారు. భీంగల్ మైనారిటీ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలలో విద్యార్థులకు పంపిణీ చేసిన దుప్పట్లు, కాస్మొటిక్ కిట్ లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలోని ఇతర (మిగతా 2లో)



## స్థానిక ఎన్నికలు రిజర్వేషన్ల తర్వాతనే

- రాజంపేట మండలంలో పలు గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే మదన్ మోహన్
- పోడు భూముల సమస్యలకు కృషి చేస్తానన్న ఎమ్మెల్యే
- ఎల్లారెడ్డి లో బస్సు డిపో కోసం పోరాటం
- ప్రైమరీ స్కూల్ కు మరుగుదొడ్లు నీటి సదుపాయం కల్పిస్తానన్న ఎమ్మెల్యే



**సూర్య రాజంపేట**

స్థానిక ఎన్నికలు రిజర్వేషన్ల తర్వాతనే అని ఎమ్మెల్యే మదన్ మోహన్ అన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గం రాజంపేట మండలంలోని బస్వాన్నపల్లి,ఆర్గొండ,



కొండాపూర్,గుండారం పలు గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు. పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. పోడు భూముల సమస్యకు కృషి చేస్తానన్న ఎమ్మెల్యే పోడు భూముల విషయంలో సమాధానం ఇస్తూ రాష్ట్రం మొత్తం మీద పోడు భూముల,రెవిన్యూ సంస్థలు రెండు కలిపి అనగా రెవిన్యూ శాఖ మంత్రి మరియు ఫారెస్ట్ శాఖ మంత్రి ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో నిర్ణయం తీసుకోవాలి. నేను ఎమ్మెల్యేగా నా నియోజకవర్గంలో చాలా మటుకు పోడు భూముల సమస్యలు ఉన్నాయి. గత ప్రభుత్వంలో ఆర్వో ఎఫ్ఆర్ చట్టం కింద ఎల్ ఆర్ యుపి ప్రోగ్రాం ద్వారా పోడు భూములకు పట్టాలు ఇవ్వడం జరిగింది. ఇక్కడ ట్రైబార్స్ చాలా ఎక్కువ ఉండడం వలన ఈ రెవెన్యూ పట్టా భూములకు ఆర్ ఎఫ్ ఆర్ ఇచ్చారు. ఇచ్చిన గాని ఆ భూమిలో బోరు వేయడం గానీ, ట్రాక్టర్ తో దున్నడం గాని చేయలేకపోతున్నారు. ఇలా చాలా (మిగతా 2లో)

# క్రిప్టో “మాయ”




**సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి**

**- కుదేలైన వ్యాపారాలు, లబోదిబోమంటున్న బాధితులు..**

సాధారణంగా ఈ ప్రాంతంలో సంవత్సరంలో ఒక నెల రెండు నెలలు మినహాయిస్తే మార్కెట్ ఎప్పుడు ఉంటుంది. ఈ ప్రాంతంలో అత్యధికంగా గల్ఫ్ వెళ్లినవారు ఉండటంతో మార్కెట్ లో డబ్బులు అటూ...ఇటూ మారుతూ ఉంటాయి, కరోనా కష్టకాలంలో కూడా ఈ ప్రాంతంలో మార్కెట్ ఇబ్బంది కలగలేదు,కానీ గత రెండు నెలలుగా మర్కెట్ పూర్తి బలహీనపడింది. ఒక్క రైతుల వద్దనుండి తప్పా ఇతర ఎక్కడినుండి డబ్బులు చేతులు మారటం లేదు,దీంతో చిరు వ్యాపారులనుండి బడా వ్యాపారుల వరకు తీవ్రమైన ఇబ్బంది నెలకొంది. రియల్ ఎస్టేట్ వ్యాపారంపై ఆధారపడిన వారు ఇప్పుడు ఏం చేయాలో తెలియక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు, మార్కెట్ ఎప్పుడు కళకళలాడుతూ ఉండేది కానీ ఇప్పుడు బోసిపోయినట్టు కనిపిస్తుందని ఇలాంటి పరిస్థితిని ఎప్పుడూ చూడలేము అని వ్యాపారస్తులు తెలుపుతున్నారు, ఆరోగ్య సమస్యలు ఏమైనా ఉన్నప్పుడు మార్కెట్లో డబ్బులు కావాలంటే దొరకడం లేదని ఉన్న డబ్బులు అంతా ఎక్కడో పెట్టారో తెలియదని వాపోతున్నారు. పెద్ద పెద్ద పేరు ఉన్న వ్యక్తులే అందులో పెట్టుబడులు పెట్టేసరికి వారిని చూసి మరింతమంది క్విప్టో మాయలో పడిపోయారు, పెళ్లిళ్ల సీజన్ తో వస్త్రాల దుకాణాలు మాత్రమే జనాలతో నిండి ఉన్నాయి మిగతా ఏ వ్యాపారం కూడా సరిగా సాగడం లేదని వ్యాపారస్తులు వాపోతున్నారు, మార్కెట్లో డబ్బులు ఉంటేనే అన్ని రంగాల్లో ఉన్న చిరు వ్యాపారస్తులు ఉద్యోగులు దినసరి కూలీల డబ్బులు వస్తాయి.పూర్తిగా మార్కెట్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు...

**- లక్ష పెట్టు...లక్షల్లో సంపాదించు...**

క్రిప్టో కరెన్సీ లోని యూ బిట్ కాయిన్ ఇప్పుడు ట్రెండింగ్ లో ఉంది,అమెరికా లోని గొప్ప గొప్ప సంపన్నులు బుట్ కాయిన్ లతో వ్యాపారం చేస్తారని,మార్కెట్ రేట్లను బట్టీ కాయిన్ రేట్ పెరుగుతుందని యూ బిట్ కాయిన్ విక్రయించెవాళ్లు చెపుతున్న విషయం,ఒక వ్యక్తికి యూ బిట్ కాయిన్ మాస్టర్ డ్యాష్ బోర్డునుండి లక్ష పాయింట్స్(కాయిన్) పంపిస్తే ఆ వ్యక్తి కి పన్నెండు నెలలపాటు ప్రతినెల 13000 వస్తాయని చెపుతారు,అందులో జాయిన్ అయ్యాకా ఆ వ్యక్తి నెలలోపు ఇంకొకరిని జాయిన్ చేసుకొని ఆ లక్ష రూపాలు లిక్విడ్ తీసుకోవచ్చని చెపుతారు.ఏం పని చెయ్యకపోయినా నెల నెల 13000 సంపాదించుకోవచ్చు అనే మాయలో చాలా మంది ఐదు లక్షల నుండి పదిలక్షల వరకు అందులో పెట్టుబడులు పెడుతున్నారు.

**- బ్యాంకాక్, థాయిలాండ్ ట్రిప్ లతో ఎర**

మొదటగా పెట్టిన వాళ్లకు పెద్దమొత్తంలో డబ్బులు వచ్చినట్టు డ్యాష్ బోర్డులో కనిపించటంతోపాటు కొత్తగా వచ్చేవారికోసం భారీ ఆఫర్ ఇస్తున్నారు,అనుకున్న స్తాయిలో తమ ప్రతిభ చూపిస్తే ఫారీన్ ట్రిప్ మొత్తం వాళ్లే చూసుకుంటున్నట్టు” ఎరా” వేస్తున్నారు.ఫ్లైట్ టికెట్ బుకింగ్ నుండి విలాసవంతమైన హొటలలో విడిది ,వారం పాటు ట్రిప్ లతో జనాలను ఆకర్శిస్తున్నారు.దీనిని నమ్మిన జనాలు విహారయాత్రలు ఏంటొ కానీ అసలుకే మోసం వచ్చిందని నష్టపోయాకా చెపుతున్నారు..

**- అంతా కనిపించె అంకెలే...చేతులు మారుతున్న లిక్విడ్**

క్రిప్టో కరెన్సీ అనే ఆప్ మన దేశంలో కాకుండా అమెరికా లాంటి దేశాల్లో ఎంతో ప్రాచుర్యం పొందాయి,ప్రపంచ కుబేరుడు ఎలాన్ మాస్క్ లాంటివాళ్లు బిట్ కాయిన్ వాడుతారు,ఆ ప్రాచుర్యం ఆసరాగా చేసుకున్న సైబర్ నేరగాళ్లు క్రిప్టో పేరుతో టెలిగ్రామ్ ,వాట్సప్ లో గ్రూపులు క్రియోట్ చేసి అందులో వేల,లక్షలమంది ఉన్నట్టు చూపిస్తారు,ఆ గ్రూపులోకి ఆహ్వానించి నమ్మబలుకుతారు,వారి ట్రాప్ లో చిక్కిన వాళ్లు వాళ్లు ఫోన్ పే ,గూగుల్ పే ద్వారా పెట్టుబడులు పెడుతున్నారు,వాళ్లకు యూ బిట్ కాయిన్ పేరుతో ఉన్న ఆప్ లను ఇన్స్టాల్ చేసుకొమ్మని చెప్పి ఆ డబ్బులను డ్యాస్ బోర్డులో చూపిస్తారు, తమకు డబ్బులు వస్తున్నాయని నమ్మిన సదురు వ్యక్తులు తమ పరిచయస్తులు, భంధువుల వద్ద లిక్విడ్ క్యాష్ తీసుకొని అతని డ్యాష్ బోర్డు నుండి వాళ్లకు కాయిన్స్ పంపిస్తారు.ఇలా అదేదో సినిమాలో చెప్పినట్లు నువ్వు ముగ్గురికి చెప్పు ఆ ముగ్గురు మరో ముగ్గురికి చెపుతారు అన్నట్లు ఈ చైన్ సిస్టం పెరుగుతూనే ఉంటుంది,మొదతగా డబ్బులు తీసుకున్న వ్యక్తికి ఆ చైన్ ఎలా పెరుగుతుందో అలా కమీషన్ వస్తుందని చెపుతారు,ఇక్కడ గమణించాల్సిన విషయం ఏంటంటే ఎక్కడ బ్యాంకు ట్రాన్సాక్షన్, ఎక్కడ డబ్బుల చెల్లింపులు జరగవు ఒకరిపై ఒకరికి నమ్మకంతో బిట్ కాయిన్ ఫేక్ ఆప్ లో చూపిస్తున్నది మాత్రమే పంపటానికి వీలుంటుంది. డాష్ బోలో ఉన్న డబ్బులను విత్ డ్రా చేసుకోరాదు ఫోన్ పే ఇతర ఆకుల ద్వారా పంపరాదు కేవలం క్రిప్టో కరెన్సీలో పెట్టుబడి పెట్టే వారికి మాత్రమే వాటిని పంపించి లిక్విడ్ డబ్బులను తీసుకోవచ్చు ఇలా ఎవరైతే క్రిప్టో కరెన్సీ లో జాయిన్ చేసుకుంటున్నారు వారిదే పూర్తి బాధ్యత...

**- బాండ్ పేపర్లు రాసిచ్చి మరీ జాయినింగ్**

కొందరు యు బిట్ కాయిన్ పేరుతో వచ్చే వాటిలో జాయిన్ కావడానికి ఇష్టపడకపోవడంతో తమదే బాధ్యత అంటూ కొందరు బాండ్ పేపర్లు రాసిచ్చి మరి పెట్టుబడులు పెట్టిస్తున్నారు, తీరా దానికి సంబంధించిన ఆపు ఓపెన్ కాకపోవడంతో లబోదిబోమంటున్న బాధితులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం లేదా బాండ్ పేపర్ తో వ్యక్తుల వద్దకు వెళ్తే తాము కూడా మోసపోయామని తాము ఎక్కడ ఉంది డబ్బులు తీసుకువచ్చి ఇవ్వాలని చెబుతున్నట్లు తెలుస్తోంది. ఈక్విటో మాయలో బడా బడా నాయకులు వ్యాపారవేత్తలు పెద్ద ఎత్తున పెట్టుబడి పెట్టి మోసపోయినప్పటికీ తెలిస్తే పరువు పోతుందని బయటకు చెప్పుకోలేక ఇబ్బంది పడుతున్నారు.. ఇప్పటికైనా పోలి శాఖ వారు ఇలాంటి ఫేక్ ఆప్ లతో సృష్టిస్తున్న హంగామాను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది..

## పోలింగ్ కేంద్రాలలో వసతులను పరిశీలించిన కలెక్టర్

(మొదటి పేజి తరువాయి)

సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు కూడా వీటి పంపిణీ జరిగిందా అని ఆరా తీశారు. పలు తరగతి గదులకు వెళ్లి బోధనా తీరును పరిశీలించిన కలెక్టర్, బాలబాలికలకు పలు ప్రశ్నలు అడిగి వారి అభ్యసన సామర్థ్యాన్ని పరీక్షించారు. వార్షిక పరీక్షలు సమీపించినందున సకాలంలో సిలబస్ పూర్తయ్యేలా ప్రణాళికాబద్ధంగా బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పదవ తరగతిలో అత్యుత్తమ గ్రేడ్ పాయింట్లతో విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించేలా వారిని అన్ని విధాలుగా సన్నద్ధం చేయాలని అన్నారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ ఆర్డీఓ రాజాగౌడ్, స్థానిక అధికారులు ఉన్నారు.

## గుండెపోటుతో మార్కెట్ కమిటీ సెక్రటరీ మృతి

**సూర్య- బిక్కనూర్**



మండల కేంద్రంలోని స్థానిక మార్కెట్ కమిటీ సెక్రటరీ నర్సింలు (55) గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. జిల్లా కేంద్రంలోని దేవుని పల్లి లో నివాసం ఉంటున్న మార్కెట్ కమిటీ సెక్రటరీ నర్సింలుకు చాతిలో నొప్పి రావడంతో కుటుంబీకులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా మార్కెట్ కమిటీ సెక్రటరీ నర్సింలు మృతి పట్ల మార్కెట్ కమిటీ చైర్మన్ పాత రాజు, వైస్ చైర్మన్ పాపనోళ్ల స్వామి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మార్కెట్ కమిటీ కార్యాలయ సిబ్బంది నివాళులర్పించారు

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**సూర్య బాల్కొండ**




బాల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని చిట్టాపూర్ జాతీయ రహదారి 44 పై బుధవారం అర్ధరాత్రి దాడిన తర్వాత లారీని వెనుక నుండి కారు ఢీ కొట్టిన ఘటనలో ఒక యువకుడు మృతి చెందాడు. బాల్కొండ ఇన్చార్జి ఎస్సై రజినీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ లోని చింతల్ కు చెందిన పోతు రమేష్ చంద్రశేఖర్ చారి,వనం శ్రీనివాస్ రజినీకాంత్,పోతు సాయి విశాల్, వనం సంపత్ రానా లు కుంభమేళా కొరకు హైదరాబాద్ నుండి కారులో ప్రయాగ్ రాజ్ కు వెళ్తున్నారు. ఈ క్రమంలో చిట్టాపూర్ శివారుకు రాగానే ముందుగా వెళ్తున్న లారీని దాటవేసే క్రమంలో లారీ ఒక్కసారిగా ఎడమ వైపు తిప్పడంతో వెనుక వెళ్తున్న కారు లారీ వెనుక భాగంలోకి చోచ్చుక పోయింది. దీంతో కారులో ఉన్న వనం సంపత్ రానా (26) యువకుడికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ప్రయాణిస్తున్న మరో 5 గురికి కూడా గాయాలైనట్లు ఇన్చార్జి ఎస్సై తెలిపాడు.అందులో ఒకరికి తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# స్థానిక ఎన్నికలు రిజర్వేషన్ల తర్వాతనే



(మొదటి పేజి తరువాయి)

సమస్యలు నా నియోజకవర్గంలో ప్రత్యేకించి ఉన్నాయని నేను అసెంబ్లీలో మాట్లాడిన తర్వాత దాన్ని ఒక చట్టం లాగా తీసుకొచ్చి అసెంబ్లీ నుండి అన్ని జిల్లా కలెక్టర్లకు ఆర్డర్ కాపీ పంపించి, కమిటీ వేయడం జరిగింది. అలాగే పోడు భూములకు కూడా రైతు భరోసా ఎందుకు ఇవ్వడం లేదని అడగడం జరిగింది. అడిగిన తర్వాతనే ఇప్పుడు పోడు భూముల కూడా రైతు భరోసా ఇవ్వడం జరుగుతుంది. దాని గురించి ఈ మధ్యనే కలెక్టర్,డీఎఫ్ఓ గారితో మాట్లాడానని తెలిపారు. ప్రత్యేకంగా నా నియోజకవర్గంలోని రాజంపేట మండలంలో బీసీలకు చాలా సమస్యలు ఉన్నాయని, ఫారెస్ట్ అధికారులు కూడా చాలా ఇబ్బంది పెడుతున్నారు. ఈ సమస్య 100 శాతం పూర్తయ్య వరకు నేను వదిలిపెట్టే ప్రసక్తి లేదని, రాబోయే అసెంబ్లీ సమావేశంలో దీనిపై పోరాడుతానని తెలిపారు.

**స్థానిక ఎన్నికల్లో బిసి రిజర్వేషన్లు**

స్థానిక సంస్థ గత ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ గురించి విలేకరు ప్రస్తావించగా కులగనన సర్వే పూర్తి కాలేదని ఇంకా 3.1 శాతం ఉందని, పది పదిహేను రోజుల్లో పూర్తి అవుతుందని, పూర్తి కాగానే దాని ప్రకారం స్థానిక ఎన్నికల్లో బీసీ, ఎస్సీ మైనార్టీ రిజర్వేషన్లను ముఖ్యమంత్రి క్యాబినెట్ మంత్రులు, ఎమ్మెల్యేలు కలిసి బీసీలకు న్యాయం జరిగేలా, రిజర్వేషన్ కరెక్ట్ అమలయ్యేలా ఒకే విధంగా నిర్ణయాలు తీసుకుంటామని, ఆ తర్వాతనే స్థానిక ఎన్నికలకు వెళ్తామని, రాజకీయంగా బీసీలు ఎదగాలని, తప్పకుండా ఎల్లారెడ్డి నియోజకవర్గంలో బీసీలకు, ఎస్సీలకు ఎక్కువ శాతం సీట్లు కేటాయించి వారిని రాజకీయంగా ముందుకు తీసుకెళ్తానని ఒక ఎమ్మెల్యేగా చెబుతున్నానన్నారు.

**ఎల్లారెడ్డిలో బస్సు డిపో కోసం పోరాటం**

ఎల్లారెడ్డి నియోజకవర్గం గత 40 సంవత్సరాల నుండి వెనుకబడిన ప్రాంతంగా ఉంది. ఈ ప్రాంత ప్రజలకు సరైన రోడ్డు మార్గం లేక, ఎలాంటి ఇండస్ట్రియల్ ఈ ప్రాంతంలో లేక చాలా వెనుకబడిన ప్రాంతంగా మిగిలిపోయింది అని, సరైన బస్సు సౌకర్యాలు లేక రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల కన్నా ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఎక్కువ ట్రైబల్స్ ఏరియల్ ఉన్నాయని వారికి కనీస బస్ సౌకర్య లేక రవాణాకు ఇబ్బంది పడుతున్నారని, గిరిజనులకు మధ్యతరగతి కుటుంబాలకు, బస్సు సౌకర్యమే ప్రధానమని, ఇక్కడ చుట్టుప్రక్కల అన్ని నియోజకవర్గాలకు బస్సు డిపో సౌకర్యాలు ఉన్నాయని, అలాంటిది ఎల్లారెడ్డి నియోజకవర్గానికి బస్ డిపో సౌకర్యం లేకపోవడంతో, ప్రజలకు ఇబ్బంది చాలా కలుగుతుందని, ఈ విషయంలో రవాణా శాఖ మంత్రి వద్దకు వెళ్లి ఇప్పటికి మూడుసార్లు కలిశానని, అసెంబ్లీలో కూడా ఈ విషయంలో ప్రస్తావించానని, ఎట్టి పరిస్థితిలో మాకు బస్సు డిపో కావాలని మంతితో నేను కొట్లాడానని, బస్సు డిపో వల్ల ఇక్కడ 98% ప్రజలు చిన్న సన్న కారు రైతులు, గిరిజనులకు ఉపయోగపడుతుందని తెలిపారు. బస్ డిపో కోసం 5 ఎకరాలు కేటాయించిన తర్వాత కూడా అది క్యాన్సిల్ చేపించారు. నేను ముఖ్యమంత్రి రవాణా శాఖ మంత్రితో కొట్లాడి వచ్చే బడ్జెట్ సమావేశంలో బస్ డిపో కోసం బడ్జెట్ కేటాయించేలా పోరాడుతానన్నారు.

**ప్రైమరీ స్కూల్ సందర్శన**

పర్యటనలో భాగంగా రాజంపేట మండలంలో ఆర్గొండ గ్రామంలోని ప్రైమరీ స్కూల్ సందర్శించారు. ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయుల తో కలిసి కాంగ్రెస్ పార్టీ తరుపున స్కూల్ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు మరుగుదొడ్లు, నీటి సదుపాయం లేకపోవడం విద్యార్థులు చాలా అవస్థలకు గురవుతున్నారని, గత ప్రభుత్వంలో మన ఊరు మనబడి క్రింద స్కూల్ బిల్డింగ్ పనులు మొదలై కాంట్రాక్టర్ బిల్లులు రాక బిల్డింగ్ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయని ఎమ్మెల్యే దృష్టికి పాఠశాల సిబ్బంది గ్రామ కాంగ్రెస్ నాయకులు తీసుకురాగా ఆ విషయంలో కాంట్రాక్టర్ ను పిలిచి నిలిచిపోయిన స్కూల్ బిల్డింగ్ పనులు పూర్తి చేయాలని, బిల్లులు ఇప్పించే బాధ్యత నాదని తెలిపారు. అలాగే పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం బోరు సదుపాయం, మరుగుదొడ్ల సౌకర్యాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలని సిబ్బందికి సూచించారు.

# ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదు

**-వారి డిమాండ్లు నెరవేరాలని అంటే బీజేపీ బలపరిచిన అభ్యర్థి కొమురయ్య కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలి**

**- ఉపాధ్యాయ MLC ప్రభారి NVSS ప్రభాకర్**

**సూర్య కామారెడ్డి టౌన్**

ప్రతి ఓటరును ప్రత్యక్షంగా కలిసి బీజేపీ బలపరిచిన అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయమని కోరాలి అని ఎమ్మెల్సి ప్రభాకర్ రావు తెలిపారు. నిరుద్యోగులు ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి వేచి చూస్తున్నారు అని అన్నారు. పట్టభద్రుల %మీజ% ఎన్నికల జిల్లా ప్రభారీ పెద్దోళ్ల గంగారెడ్డిపట్టభద్రులు, ఉపాధ్యాయ %మీజ% ఎన్నికల్లో భాగంగా నేడు బీజేపీ జిల్లా కార్యాలయంలో కామారెడ్డి అసెంబ్లీ కి సంబంధించిన ఓటరు ఇంచార్జీల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఉపాధ్యాయ %మీజ% ప్రభారీ %చీమూా% ప్రభాకర్



మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదనీ అన్నారు. వారి డిమాండ్లు నెరవేరాలని అంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి అంటే బీజేపీ బలపరిచిన అభ్యర్థి కొమురయ్య కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలనీ ప్రతి ఓటరును కలిసి విజ్ఞప్తి చేయాలని అన్నారు. పట్టభద్రుల %మీజ% జిల్లా ప్రభారి పెద్దోళ్ల గంగారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఓటరును ప్రత్యక్షంగా కలిసి బీజేపీ బలపరిచిన అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయమని కోరాలనీ అన్నారు. గ్రామ గ్రామాన నిరుద్యోగులు ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి వేచి చూస్తున్నారనీ బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి గెలుపు ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు నీలం చిన్నరాజులు ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి నాయకులు శ్రీకాంత్ భరత్ నరేందర్ వేణు బాలరాజ్ సురేష్ అనిల్ భూపాల్ ప్రవీణ్ రమేష్ సంపత్ తో పాటు ఓటర్ ఇంచార్జిలు తదితరులు పాల్గొన్నారు.

## టీజీసీటీఏ నూతన డైరీఆవిష్కరించిన కళాశాల ప్రిన్సిపల్

**సూర్య కామారెడ్డి టౌన్**



స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, కామారెడ్డి లో గురువారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.విజయ్ కుమార్ చేతుల మీదుగా టీజీసీటీఏ ( తెలంగాణ గవర్నమెంట్ కాలేజీ టీచర్స్ అసోసియేషన్) 2025 సంవత్సర నూతన డైరీ ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.విజయ్ కుమార్ మాట్లాడుతూ అధ్యాపక వృత్తి తపస్సు లాంటిదని, సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర గొప్పదని అధ్యాపకులు సమన్వయంతో పనిచేసి కళాశాల ఉన్నతికి తోడ్పడాలని కోరారు. నూతన డైరీలో సర్వీస్ రూల్స్ సంబంధించిన వివిధ అంశాలు చక్కగా పొందుపరిచారని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా బాధ్యులు డాక్టర్ ఏ.సుదాకర్, డాక్టర్ పి. విశ్వప్రసాద్ , డాక్టర్ టీ. దినకర్, జి.మానస తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన పురాతన దేవాలయం నూతనంగా నిర్మాణం

**సూర్య కామారెడ్డి**



తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన దేవాలయంగా బొంపల్లి సదాశివ నగర్ మండల భూంపల్లి గ్రామంలో నిర్మిస్తున్న అంబరీశ్వర ఆలయం. ఈనెల 14 నుండి 18 వరకు అంబరీశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని స్థానికులు ఆలయ కమిటీ సిబ్బంది తెలిపారు. కామారెడ్డి జిల్లా సదాశివ నగర్ మండల్ భూంపల్లి గ్రామంలో తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన దేవాలయంగా భూంపల్లి అంబరీశ్వర ఆలయం నిర్మించడం జరిగింది గ్రామస్తులు మరియు వివిధ దాతలు విరాళ ఆధ్వర్యంలో గుడి నిర్మాణం వేగవంతం చేసి గుడి ప్రారంభించడానికి ఫిబ్రవరి 14 నుండి ఐదు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగే జాతర కార్యక్రమం మరియు సన్మాన కార్యక్రమం ఉంటుంది తెలంగాణలో ఎక్కడ లేని విధంగా శ్రీ రాజరాజేశ్వరి స్వామి ఆలయం వేములవాడలో ఉన్నట్టుగా భూంపల్లి అంబరీశ్వర ఆలయం నిర్మించడం గ్రానైట్ రాయితో నిర్మించడంతోపాటు వందల ఏండ్లు చెక్కుచెదరకుండా ఉండడంతో పాటు పరాటక కేంద్రంగా కాను భూంపల్లి అంబరీశ్వర ఆలయ నిర్మాణం పూర్తి కావడంతో పాటు ఆలయ పరిసర ప్రాంతంలో ఫిబ్రవరి 14 నుండి 18 వరకు జరిగే అంబరీశ్వర స్వామి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ కండక్టర్ రాజిరెడ్డి తెలిపారు గుడి ఈ నిర్మాణానికి తోచినంతగా విరాళం అంతా చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు రాష్ట్రంలోనే ఎక్కడ చూడని విధంగా భూంపల్లి గ్రామ సమీపంలో ఉన్న శ్రీ అంబరీశ్వర స్వామి దేవాలయం ప్రసిద్ధిగాంచిందని అప్పుడు చిన్నగా గుడ్డు నిర్మించాలని ఇప్పుడు దాతల సహకారంతో గ్రానైట్ రాయితో గుడి నిర్మించడం పూర్తయిందని తెలంగాణ రాష్ట్రంలో పర్యాటక కేంద్రంగా భూంపల్లి గ్రామం ఉంటుందని. వివిధ గ్రామానికి చెందిన ప్రజలు అంటున్నారు శ్రీ అంబరీశ్వర స్వామి గుట్టపై చల్లని వాతావరణం మరియు దేవుని కృప ఉండడంతో ఇంత కష్టపడి గుడి నిర్మాణానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

## మండలంలో ఉపాధ్యాయుల పనితీరు సంతృప్తికరం: ఎంఈఓ

**సూర్య- బిక్కనూర్**



మండలంలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల పనితీరు సంతృప్తి కరంగా ఉందని, మండల విద్యా వనరుల అధికారి రాజా గంగారెడ్డి చెప్పారు. గురు వారం మండలంలోని బస్వా పూర్ గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ ఉపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ పాఠశాల ఉపాధ్యాయులు తయారుచేసిన బోధన ఉపకరణ సామాగ్రిని ప్రదర్శించగా ఎంఈఓ తిలకించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు నిర్వహించిన అన్ని పరీక్షలకు సంబంధించిన విద్యార్థుల ప్రగతిని ఆన్ లైన్లో నమోదు చెయ్యాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు జయదేవ్, సి ఆర్ పి లు వైద్య సంపత్, పాపయ్య మండల విద్యా వనరుల సిబ్బంది పాల్గొన్నారు.

## సేవాలాల్ జయంతిని 'జాతీయ సెలవు' దినంగా ప్రకటించాలి

**- లంబాడ సామాజిక వర్గానికి మంత్రివర్గంలో స్థానం కల్పించాలి.**

**సూర్య బోధన్**

ఫిబ్రవరి 15న సేవాలాల్ మహారాజ్ జయంతి రోజును 'జాతీయ సెలవు'దినంగా ప్రకటించాలని, తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రివర్గ విస్తరణలో 50 లక్షలకు పైగా జనాభా ఉన్న లంబాడ సామాజిక వర్గానికి, మంత్రివర్గంలో స్థానం కల్పించాలని గిరిజన విద్యార్థి సంఘం బోధన్ మండల అధ్యక్షుడు జాదవ్ ప్రవీణ్ నాయక్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. లంబాడాల ఆరాధ్య దైవమైన టువంటి సేవాలాల్ మహారాజ్ బంజారాల అభివృద్ధి, సంస్కృతి సంప్రదాయాల అభ్యున్నతి కోసం ఎంతగానో పాటుపడిన మహోన్నతమైన వ్యక్తి అని, అటువంటి గొప్ప చరిత్ర కలిగిన సేవాలాల్ మహారాజ్ సేవలను గుర్తించి ప్రభుత్వం తక్షణమే 'జాతీయ సెలవు' దినంగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. లంబాడాలు మాట్లాడే 'గోర్ బోలి'భాషను భారత రాజ్యాంగంలో ఎనిమిదో షెడ్యూల్లో చేర్చాలని, అలాగే సేవాలాల్ మహారాజ్ జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాలలో చేర్పించాలని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడ్డాక, ఏర్పాటుచేసిన తండాల గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు.

## నేడు విద్యుత్ సరఫరలో అంతరాయం..

**సూర్య- నవీపేట్:**

మండలంలో గల జన్నేపల్లి 33/11 కేవి సబ్ స్టేషన్ పరిధిలో గల జన్నేపల్లి, నారాయణపూర్ (నాడాపూర్), గాంధీనగర్, సిరన్ పల్లి గ్రామలలో ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు మరమ్మత్తుల పనుల నిమిత్తం విద్యుత్ సరఫరలో అంతరాయం ఏర్పడనుందని నవీపేట్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ ప్రశాంత్ రెడ్డి తెలిపినారు. కావున ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించవలసినదిగా ఆయన కోరినారు.

## కౌన్సిలర్ కన్నయ్యకు ఘనంగా సన్మానం

**సూర్య కామారెడ్డి**



ప్రతి ఏట నిర్వహించే గంగ మాత వార్షికోత్సవాలను ఈసారి కూడా గంగా మాత ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు సంఘ సభ్యులు ఏర్పాటు చేస్తున్నారు.శ్రీ గంగామాత 23 వార్షికోత్సవ సందర్భంగా ఆ పార్వతి సమేత శివగంగా కళ్యాణం మరియు బోనాల ఊరేగింపు కార్యక్రమం లో గంగపుత్రుల కుల సభ్యులు ఘనంగా సన్మానం చేయడం జరిగింది. గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు సంఘ సభ్యులు అందరూ కృషి చేయాలని రంగపుత్ర సంఘం కామారెడ్డి అధ్యక్షులు మహేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగపుత్ర సభ్యులు మహేందర్ తో పాటు లక్ష్మణ్ శ్రీనివాస్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## తాళం వేసిన ఇంట్లో చోరీ

**సూర్య మాక్లూర్**

తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన చోటుచేసుకుంది.పోలీసుల కథనం ప్రకారం మండలంలోని అడవి మామిడిపల్లి గ్రామంలో తాళం వేసిన ఇంట్లో దొంగలు పడి 17 గ్రాముల బంగారం,22 వేల నగదు దొంగలించడం జరిగింది.భవిత పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ అజ్మత్ తెలిపారు.

## విధి నిర్వహణలో అంకిత భావంతో పని చెయ్యాలని, సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవాలి ఎ ఆర్ డి ఎస్ పి

**సూర్య కామారెడ్డి**



కొత్తగా వచ్చిన ఆర్మడ్ రిజర్వు కానిస్టేబుల్ పోలీసులకు ఒక రోజు సీనియర్ అధికారులతో శిక్షణ- అర్మడ్ రిజర్వు డిఎస్పి యాకూబ్ రెడ్డి వెల్లడించారు. జిల్లా ఎస్పీ సింధు శర్మ ఆదేశాల మేరకు జిల్లాలో నూతనంగా వచ్చిన ఆర్మడ్ రిజర్వు పోలీసు కానిస్టేబుల్ కు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఒక రోజు శిక్షణ ఇవ్వడం జరిగింది.శిక్షణ ముఖ్య ఉద్దేశం కొత్తగా పోలీస్ శాఖ వచ్చిన కానిస్టేబుల్లు వివిఐపి విధులు ఎలా నిర్వర్తించాలి, ప్రజలతో ఎలా మెలగాలి, బందోబస్తు డ్యూటీ కి వెళ్ళినప్పుడు డ్యూటీ ఎలా చేయాలి, శాంతి భద్రత విఘాతం కలిగించే మరియు ప్రజలతో ఏ విధంగా నడుచుకోవాలి అనే విషయాలపై జిల్లాలోని అనుబవజ్ఞులైన పోలీస్ అధికారులతో అవగాహన శిక్షణ కార్యక్రమం చేపట్టడం జరిగిందని అర్మడ్ రిజర్వు డిఎస్పి యాకూబ్ రెడ్డి తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఆర్మడ్ రిజర్వు డిఎస్పి యాకూబ్ రెడ్డి , ఆర్ఐలు సంతోష్ కుమార్, నవీన్ కుమార్, కృష్ణ, సిఐలు చంద్రశేఖర్ తిరుపతయ్య, నరేష్, రామన్ మరియు ఎస్ఐలు ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక రాజకీయ నాయకులతో మండల పరిషత్ అధికారి సమావేశం నిర్వహణ

**సూర్య. బీర్కూర్.**



బీర్కూరు మండల పరిషత్ కార్యాలయంలో రాబోవు స్థానిక ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ కేంద్రాలు మరియు ఓటర్ లిస్టుల గురించి వివిధ పార్టీల నాయకులతో మండల పరిషత్ అభివృద్ధి అధికారి భాను ప్రకాష్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల ఏర్పాటు మరియు ఓటర్ లిస్టులో అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రఘు, స్థానిక నాయకులు నాగేళ్ల సాయికుమార్, మేకల రాములు ఎంపీ ఓ మహబూబ్, గ్రామ కార్యదర్శి గంగారం తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు రైతు భరోసా బ్యాంక్ ఖాతాలో జమ

**సూర్య కామారెడ్డి**



కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా రైతు భరోసా రైతు రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు చేయాలని భారతీయ శాంసంగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబిర్ ఆనందరావు డిమాండ్ చేశారు కిషన్ సంగ్ జిల్లా అధ్యక్షులు ఇట్టల్ రెడ్డి అధ్యక్షతన గురువారం జిల్లాస్థాయిలో సమావేశం నిర్వహించారు రైతుల సమస్యలపై చర్చించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటివరకు అనేక మందికి రుణమాఫీ కాలేదని అన్నారు రైతు భరోసా అందరికీ వర్తింపజేయాలని అన్నారు. వేసవిలో నిరంతరంగా విద్యుత్ ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో నాయకులు కొమిరెడ్డి పెద్ద అంజన్న వెంకటరెడ్డి శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

# బోధనోపకరణాలతో విద్యార్థులకు సృజనాత్మకత పెరుగుతుంది

## - టీచింగ్,లెర్నింగ్ మెటీరియల్లను పరిశీలించిన -ఎంఈఓ,షౌకత్ అలీ

**సూర్య,లింగంపేట్**



విద్యను సులువుగా అభ్యసించే విధంగా బోధనోపకరణాలు తయారు చేయడం అభినందనీ యమని మండల విద్యాధికారి షౌకత్ అలీ ఉపాధ్యాయులను అభినందించారు.ఆయన గురువారం సరోజినీ నాయుడు పుట్టినరోజు పురస్కరించుకొని ఆంగ్లం డే సందర్భంగా నెలవారి కాంప్లెక్స్ సమావేశంలో భాగంగా శెట్పల్లి ఉన్నత పాఠశాల కాంప్లెక్స్,లింగంపేట్ మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ సమావేశంలో ఉపాధ్యాయులు తయారు చేసిన టీచింగ్,లెర్నింగ్ మెటీరియల్ మేలను ఆయన పరిశీలించారు. శెట్పల్లి కాంప్లెక్స్ సముదాయంలో ఉన్న 13 పాఠశాల ఉపాధ్యాయులు ఇంగ్లీష్,తెలుగు, గణితం, పరిసరాల విజ్ఞానం, సంబంధించిన వివిధ రకాల 200 బోధనోపకరణాలు ప్రదర్శించడంపై ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కృత్యాధార బోధనతో విద్యను అభ్యసించే విదంగా బోదనోపకరణాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.లింగంపేట్ బాలికల ఉన్నత పాఠశాల సమావేశంలో కాంప్లెక్స్ ప్రదానోపాధ్యాయురాలు శోభ రాణి మాట్లాడుతూ బోధనోపకరణాలు ఉపయోగించి భోధన చేయడం వలన విద్యార్థులకు సులభతరంగా బోధించవచ్చని తెలిపారు.విద్యార్థులకు అభ్యాసన పట్ల ఆసక్తి కలుగుతు విద్యార్థుల్లో సృజనాత్మక పెరుగుతుందని అన్నారు.ఉపాధ్యాయులు తయారుచేసిన బోధనోపకరణాలను వివిధ పాఠశాల విద్యార్థులు వీక్షించారు.అనంతరం బోధనభ్యాస పకరణాలు తయారు చేసిన ఉపాధ్యాయులకు బహుమతులు ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల పిజిహెచ్ఎం శేషయ్య,వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ,ప్రధానోపాధ్యాయులు సూరయ్య, ప్రదాపనాధ్యాయులు పారు సిద్దిపేట్, ఉపాధ్యాయులు అపర్ణ,ధూప్య రాథోడ్,దత్తు, రాజు,మంజుల, దామోదర్,స్వప్న,సాయి చందన, హరీష్,అనిల్, రమాదేవి,సంధ్యారాణి,పద్మ,శైలజ, అమరేశ్వరి, కాంప్లెక్స్ సిఆర్పిలు పడమటి రాజు, సత్యనారాయణ,విద్యార్థులు,పాల్గొన్నారు.

## ఢిల్లీపరేడ్ లో పాల్గొన్న ధరావత్ మౌనికను సన్మానించిన కళాశాల ప్రిన్సిపల్

**సూర్య కామారెడ్డి**



గత నెల జనవరిలో ఢిల్లీలో జరిగిన గణతంత్ర దినోత్సవ పరేడ్ లో పాల్గొని వచ్చినటువంటి ధరావత్ మౌనికను ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె విజయ్ కుమార్ శాలువా మరియు జ్ఞాపికతో సత్కరించడం జరిగినదని ఎన్సిసి అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ ఏ సుధాకర్ తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ కే విజయ్ కుమార్ మాట్లాడుతూ కళాశాలకు చెందిన విద్యార్థినిని ఆదర్శంగా తీసుకొని మిగతా ఎన్సిసి విద్యార్థులందరూ కూడా రిపబ్లిక్ డే పరేడ్ లో పాల్గొనడానికి తమ వంతు కృషి చేయాలని సూచించినారు. కామారెడ్డి జిల్లా కే గర్వకారణం అని సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎన్సిసి విద్యార్థులు కళాశాల విద్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## గొడవలకు తావివ్వకుండా క్రీడల్లో పాల్గొనాలి

### - కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నారగౌడ్

**సూర్య,లింగంపేట్ -1**



ఎలాంటి గొడవలకు తావివ్వకుండా స్నేహ బావంతో క్రీడలను జరుపుకోవాలని లింగంపేట్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర నారగౌడ్ అన్నారు.ఆయన గురువారం మండల కేంద్రంలోని మాలోతాండాలో కబడ్డీ,వాలీబాల్ నియోజకవర్గస్థాయి క్రీడలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ సంత్ సేవలాల్ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని తండాలో క్రీడలు నిర్వహించడం సంతోషకరమన్నారు.ఈ కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షుడు సుప్పాల రాజు,సోషల్ మీడియా కోఆర్డినేటర్ నగేష్,మండల వర్కింగ్ ప్రెసిడెంట్ దశరథ్ నాయక్,కాంగ్రెస్ నాయకులు రామకృష్ణ గౌడ్,రాజేశ్వర్ గౌడ్,శివలాల్ వివిధ మండలాల క్రీడాకారులు పాల్గొన్నారు.

## సైన్స్ సెమినార్ కు - జిల్లా ఉపాధ్యాయుడు

**సూర్య - మోపాల్**

ఎస్సీ ఈ ఆర్టీ ఆధ్వర్యంలో ఏటా ఫిబ్రవరి లో నిర్వహించే జాతీయ సైన్స్ దినోత్సవాన్నీ పురస్కరించుకొని ఉపాధ్యాయుల సైన్స్ సెమినార్ పోటీలకు నిజామాబాదు జిల్లా కేంద్రం దుబ్బ ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు చల్లా ముద్దుకృష్ణ ఎంపికయ్యారు.. తరగతి గదిలో విజ్ఞాన శాస్త్ర ప్రమాణాలు పెంపొందించడానికి వినూత్న బోధన పద్ధతులు అంశం తాను సమర్పించిన పరిశోధన పత్రంలో ఎంపికైనట్లు అయన వెల్లడించినాడు. రాష్ట్ర వ్యాప్తంగా 165 ప్రాజెక్టులునుంచి ఉత్తమమైనవి 31ఎంపిక చేయగా అందులో చోటు దక్కిందన్నారు ఆయనను డీఈఓ అశోక్, డీఎస్ఓ గంగకిషన్ గంగ కిషన్ అభినందించారు. ఈ నెల 28 శుక్రవారం ఎస్సీ ఈ ఆర్టీ లో సెమినార్ జరగనున్నట్లు తెలిపారు.



## సందేశాత్మక చిత్రాలకు ప్రభుత్వ ప్రోత్సాహం

### - గ్రంథాలయ సంస్థ చైర్మన్

**సూర్య- బిక్కనూర్**

సందేశాత్మక చిత్రాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందజేస్తుందని, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి చెప్పారు. గురువారం మండలంలోని రామేశ్వర్ పల్లిలో ఐబిఎం ప్రొడక్షన్ బ్యానర్ పై దర్శకుడు భాను శంకర్ ఆధ్వర్యంలో నిర్మాత రవికుమార్ నిర్మిస్తున్న చిత్ర షూటింగ్ ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో సినిమా చిత్రీ కరణ కోసం మండలంలో అనుకూలమైన వాతావరణం ఉందని, సినిమా షూటింగ్ లు నిర్వహిం చడానికి స్థానికుల సహకారం ఉంటుందని చెప్పారు. అనంతరం సినిమా హీరో హీరోయిన్లను శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్ర మంలో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మద్ది సూర్యకాంత్ రెడ్డి, ఉపాధ్యక్షుడు శశి కుమార్, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు వినోద్ గౌడ్, గ్రామస్తులు చేపూరి అనిల్, రాజేశం, పెరిక సిద్ధ రాములు, ఏలేటి యాదిరెడ్డి చిత్ర బృంద సభ్యులు పాల్గొన్నారు

## ఆర్.ఎం.పి పిఎంపీల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలి

**సూర్య- బిక్కనూర్**



తమ సమస్యల సాధన కోసం ఈనెల 18వ తేదీన హైదరాబాద్ లో నిర్వహించ తలపెట్టిన గ్రామీణ వైద్యుల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని, జిల్లా పి ఎం పి, ఆర్.ఎం.పి వైద్యుల అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సత్యనారాయణ జిల్లా ఆర్.ఎం.పి పిఎంపి వైద్యులను కోరారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో వైద్య సేవలు అందిస్తున్న ఆర్ఎంపి పిఎంపీల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు గంగాధర్, ఆంజనేయులు, సుదర్శన్, తేజస్కర్ తదితరులు ఉన్నారు

## సేవలాల్ మహారాజ్ జయంతిని సెలవుదినంగా ప్రకటించాలి

**సూర్య,లింగంపేట్**


శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి 15 ఫిబ్రవరి రోజున ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలని లింగంపేట్ మండల గిరిజన నాయకులు గురువారం ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.లింగంపేట్ మండలంలోని నల్లమడుగు పెద్ద తండాలో శ్రీ సంత్ సేవలాల్ ఆలయం ముందు తాండ నాయకులు సమావేశమై సేవాలాల్ జయంతిని మండలంలోని అన్ని గిరిజన తాండలో ఘనంగా జరుపుకునేందుకు చర్చించారు.ఈ సందర్భంగా తాండ నాయకుడు ఈశ్వర్ మాట్లాడారు మా ఆరాధ్య దైవమైన సేవలాల్ మహారాజ్ జన్మదిన పురస్కరించుకొని సెలవు దినముగా ప్రభుత్వం ప్రకటించాలని కోరారు.వీరి వెంట తండా మాజీ సర్పంచ్ రవీందర్ నాయక్ తాండ నాయకులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన సినిమా హీరో సుమన్

### - వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే మదన్మోహన్,మాజీ ఎమ్మెల్యేలు

**సూర్య, లింగంపేట్**

లింగంపేట్ మండలంలోని లింగంపల్లి ఖుర్దు గ్రామానికి చెందిన గొల్ల కాశీరాం మేన బావమరిది వినేష్ యాదవ్ వివాహ వేడుకల్లో సినిమా హీరో సుమన్,ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ రావ్, మాజీ ఎమ్మెల్యేలు ఏనుగు రవీందర్ రెడ్డి, జాజాల సురేందర్,జనార్ధన్ గౌడ్ లు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.గురువారం కామారెడ్డి పట్టణ కేంద్రంలోని సత్య కన్వెన్షన్ హాల్లో జరిగిన వివాహ వేడుకల్లో పాల్గొని వధూవరులు వినేష్ యాదవ్, శృతిలను ఆశీర్వదించారు.వివాహ వేడుకల్లో పాల్గొన్న హీరో సుమన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.ఈ పెళ్లి వేడుకల్లో కామారెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, ఎల్లారెడ్డి ఏఎంసి వైస్ చైర్మన్ జొన్నల రాజు, కామారెడ్డి పట్టణ కాంగ్రెస్ నాయకుడు నయీమ్, కామారెడ్డి జిల్లాలోని వివిధ మండలాల కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు పార్టీలకు అతీతంగా నాయకులు వివాహ వేడుకలు పాల్గొన్నారు.



## హౌసింగ్ బోర్డ్ కాలనీ కి కరెంటు కష్టాలు ఇక దూరం...!

### - 100 కేవీ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటుచేసిన డి ఈ విజయ సారథి

**సూర్య ఎల్లారెడ్డి**

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోనీ హౌసింగ్ బోర్డు కాలనీకి ఇక లోఓల్టేజ్ సమస్య ఉండదని విద్యుత్ డి ఈ విజయ సారథి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా హౌసింగ్ బోర్డ్ కాలనీకి విద్యుత్ సమస్యలతో ,ఆ కాలని వాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారని.సమస్య సబ్ డివిజన్ విద్యుత్ శాఖ అధికారికి తెలియ చెయ్యగా వెంటనే, డి ఈ ఈ ,విజయ సారథి,ప్రత్యేక చొరవతో ట్రాన్స్ఫార్మర్ను బిగించారు.ఎల్లారెడ్డి లోని హౌసింగ్ బోర్డ్ కాలనీకి లోవోల్డేజ్ ప్రాబ్లం ఉండడం వలన కొత్త ట్రాన్స్ఫార్మర్ 100 కేవి ట్రాన్స్ఫరం,అవసరం ఉందని రానున్న వేసవి కాలం దృష్టిలో ఉంచుకొని ముందస్తు జాగ్రత్తతో,యస్ సి శ్రావణ్ కుమార్ ఎల్లారెడ్డి,సబ్ డివిజన్ విద్యుత్ శాఖ అధికారి, విజయ సారధి,ప్రత్యేక దృష్టి సారించారు .ఈ కార్యక్రమంలో,ఏ ఈ ఈ వెంకటస్వామి లైన్స్పెక్టర్ జగదీశ్వర్ సీనియర్ లైన్స్పెక్టర్ సితేందర్ రెడ్డి లైన్మెన్ శశికాంత్ రెడ్డి పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**సూర్య బాల్కొండ**

బాల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని చిట్టాపూర్ జాతీయ రహదారి 44 పై బుధవారం అర్ధరాత్రి దాడిన తర్వాత లారీని వెనుక నుండి కారు ఢీ కొట్టిన ఘటనలో ఒక యువ కుడు మృతి చెందాడు. బాల్కొండ ఇన్చార్జి ఎస్సై రజినీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ లోని చింతల్ కు చెందిన పోతు రమేష్ చంద్రశేఖర్ చారి,వనం శ్రీనివాస్ రజినీకాంత్,పోతు సాయి విశాల్, వనం సంపత్ రానా లు కుంభమేళా కొరకు హైదరాబాద్ నుండి కారులో ప్రయాగ్ రాజ్ కు వెళ్తున్నారు. ఈ క్రమంలో చిట్టాపూర్ శివారుకు రాగానే ముందుగా వెళ్తున్న లారీని దాటవేసే క్రమంలో లారీ ఒక్కసారిగా ఎడమ వైపు తిప్పడంతో వెనుక వెళ్తున్న కారు లారీ వెనుక భాగంలోకి చోచ్చుక పోయింది. దీంతో కారులో ఉన్న వనం సంపత్ రానా (26) యువకుడికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ప్రయాణిస్తున్న మరో 5 గురికి కూడా గాయాలైనట్లు ఇన్చార్జి ఎస్సై తెలిపాడు.అందులో ఒకరికి తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.